sahanamvande.com

epaper.sahanamvande.com

# సహనం వందే

హైదరాబాద్ | 24-07-2026 శుక్రవారం | సంపుటి-02 సంచిక : 110 EDITOR: ROHINI





# కాంగ్రెస్ గుప్పిట్లోకి కాక్రోచ్ ఉద్యమం?

## నీట్ లీక్ రగడలో ముందుకొచ్చిన రాజకీయం

- విద్యార్థుల గోడు... నాయకుల నాటకాలు
- పదవుల కోసం పాకులాట... ఉద్యమం హైజాక్
- వాంగ్‌చుక్ భార్య గీతాంజలి ఆగ్రహం
- ప్రధాని ఇంటి వద్ద రాహుల్ నిరసనపై విమర్శ
- ఉద్యమానికి రాజకీయ పార్టీల మద్దతు తప్పా

**నీట్ పేపర్ లీక్ కుంభకోణం దేశవ్యాప్తంగా కలకలం రేపుతుంటే ఢిల్లీ వీధుల్లో మాత్రం రాజకీయ పార్టీలు స్వార్థ ప్రయోజనాల కోసం విద్యార్థుల ఉద్యమాన్ని హైజాక్ చేస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి. బాధితుల గొంతును నొక్కుతూ తమ పబ్బం గడుపుకుంటున్న తీరుపై సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి సంధించిన ప్రశ్నలు ఇప్పుడు దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. - సహనం వందే, న్యూఢిల్లీ**

నీట్ పేపర్ లీక్ ఉదంతం దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలను రోడ్డున పడేసింది. ఈ నేపథ్యంలో న్యాయం చేయాలని కోరుతూ ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ఆమరణ దీక్షకు శ్రీకారం చుట్టారు. ఆయన ఆరోగ్యం క్షీణించడంతో పోలీసులు బలవంతంగా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన అక్కడి నుంచే తన దీక్షను కొనసాగిస్తూ ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

### కాంగ్రెస్ నిరసనల వెనుక డ్రామా

ఇలాంటి సున్నితమైన సమయంలో రాజకీయ పార్టీలు రంగప్రవేశం చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ముఖ్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ప్రధాని నివాసం ముట్టడికి యత్నించడం పెద్ద దుమారమే రేపింది. పార్లమెంటు వైపు వెళ్తున్న విద్యార్థుల మార్చ్‌ను కేంద్రం అడ్డుకుందనే పేరుతో కాంగ్రెస్ చేసిన ఈ హడావుడిపై సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ నిరసనల్లో అసలు చిత్తశుద్ధే లోపించిందని ఆమె కుండబద్దలు కొట్టారు.

### తెరవెనుక అవకాశవాదం

విద్యార్థులు నిజంగా జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేపట్టిన తొలి రోజుల్లో కాంగ్రెస్ నాయకులు వచ్చి ఎందుకు మద్దతు తెలపలేదని గీతాంజలి నిలదీశారు. కేవలం తమ రాజకీయ లబ్ధి కోసం మీడియా కెమెరాల ముందు హైలైట్ అవ్వడం కోసమే ఇప్పుడు ఈ డ్రామాలు ఆడుతున్నారని ఆమె విమర్శించారు. ఉద్యమం ప్రారంభమైనప్పుడు కనిపించని ప్రతిపక్షాలు ఇప్పుడు తెరపైకి రావడం కేవలం అవకాశవాద రాజకీయమేనని స్పష్టమవుతోంది. సోనమ్ వాంగ్‌చుక్ పేరుప్రఖ్యాతులను రాజకీయ పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకోవాలని చూస్తున్నాయని ఆమె ఆరోపించారు.

### యువతకు హెచ్చరిక

సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ దీక్షను కూడా రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలని చూసే పార్టీలకు గీతాంజలి మాటలు చెంపపెట్టు లాంటివి. సామాన్య ప్రజలను నేటి యువతను ఇకపై మభ్యపెట్టడం ఎవరివల్ల కూడా సాధ్యం కాదని ఆమె హెచ్చరించారు. ఉద్యమంలో ఏ వ్యక్తికి లేదా ఏ పార్టీకి చిత్తశుద్ధి ఉందో లేదో ఇట్టే పసిగట్టే శక్తి యువతకు ఉందని ఆమె స్పష్టం చేశారు. స్వార్థ ఎజెండాలతో వచ్చే రాజకీయ నాయకులను యువతే తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయని ఆమె పేర్కొన్నారు.

### పార్లమెంటు వేదికగా చట్టాలు చేయాలి

ఈ నిరసనల నేపథ్యంలో రాజకీయ పార్టీలకు యువత గట్టి సందేశం పంపిందని గీతాంజలి అభిప్రాయపడ్డారు. తమ దృష్టిలో దేశ అత్యున్నత వ్యవస్థ పార్లమెంటేనని... తమకు ఇప్పుడు అధికార పక్షం కానీ ప్రతిపక్షం కానీ ప్రత్యేకంగా లేవని ఆమె స్పష్టం చేశారు. పేపర్ లీక్ లాంటి జాతీయ సమస్యపై కేవలం పార్లమెంటు మాత్రమే దృష్టి సారించి సరైన చట్టాలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఎలాంటి రాజకీయ లక్ష్యాలు లేకుండా కేవలం విద్యార్థుల భవిష్యత్తు కోసం పనిచేసే స్వచ్ఛమైన మనసులు మాత్రమే తమతో కలిసి రావాలని పిలుపునిచ్చారు.

### ఉద్యమానికి మద్దతిస్తే తప్పా?

రాహుల్ గాంధీ, కాంగ్రెస్ శ్రేణులు ప్రధాని నివాసం ముట్టడికి యత్నించడం ఉద్రిక్తతకు దారితీసింది. పార్లమెంటు వైపు వెళ్తున్న విద్యార్థుల మార్చ్‌ను పోలీసులు అడ్డుకోవడాన్ని ఖండిస్తూ కాంగ్రెస్ నేతలు రోడ్డెక్కడంతో పోలీసులు వారిని బలవంతంగా అరెస్ట్ చేసి తరలించాల్సి వచ్చింది. కాగా వాంగ్‌చుక్ భార్య గీతాంజలి చేసిన వ్యాఖ్యలపై కూడా పలువురు విమర్శలు చేస్తున్నారు. విద్యార్థుల ఉద్యమానికి ప్రతిపక్షాలు మద్దతు ఇస్తే తప్పేంటని ఆమెను నిలదీస్తున్నారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నిరసన చేస్తే ఆమెకు వచ్చిన నష్టం ఏంటని అంటున్నారు.




# మంత్రి సేఫ్... సెక్రటరీ ఔట్

## కేంద్ర విద్యాశాఖలో ప్రక్షాళన

- వినీత్ జోషిపై వేటు... గంగ్వార్ నియామకం
- విద్యార్థి ఉద్యమంపై నీళ్లు చల్లే ప్రయత్నం
- విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సీటుకు భద్రత

**దేశాన్ని కుదిపేస్తున్న నీట్ పేపర్ లీక్ వివాదంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను తొలగించాలని నిరసనకారులు గొంతుకలు చించుకుంటుంటే, కేంద్ర ప్రభుత్వం మాత్రం అనూహ్య రీతిలో చక్రం తిప్పింది. మంత్రిని అలాగే ఉంచి, తెరవెనుక ఉండే విద్యాశాఖ కార్యదర్శిపై వేటు వేసింది. విద్యార్థులు, యువజన సంఘాలు, సీజేపీ ఆందోళనలతో దేశ రాజధానితో సహా దేశవ్యాప్తంగా నిప్పులు చెరుగుతున్న తరుణంలో ఈ పరిణామం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వంలోని పెద్దల మెడకు చుట్టుకుంటున్న ఈ కుంభకోణం ఉచ్చును తప్పుదోవ పట్టించేందుకే ఈ ఎత్తుగడ వేశారన్న విమర్శలు తీవ్రంగా వస్తున్నాయి. - సహనం వందే, న్యూఢిల్లీ**

దేశవ్యాప్తంగా ఎక్కడ చూసినా ఇప్పుడు నీట్ పరీక్షల లీకేజీ అంశమే హాట్ టాపిక్ అయిపోయింది. వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం కావడంతో లక్షలాది మంది రోడ్ల మీదకు వచ్చి ఆందోళన బాట పట్టారు. పరీక్షా వ్యవస్థలోని లోపాలపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ తీరును నిలదీస్తున్నారు. ఈ పరిణామాలన్నీ కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టాయి. నిరసనకారులు కేవలం ఆందోళనలకే పరిమితం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సరిగ్గా ఈ సున్నితమైన సమయంలోనే కేంద్ర ప్రభుత్వం పరిపాలనా పరంగా ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంది.

### కదలకుండా కూర్చున్న మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

నీట్ అక్రమాలు, పేపర్ లీకేజీల కారణంగా విద్యార్థులు, యువజన సంఘాల నుంచి తీవ్రమైన ఒత్తిడి పెరుగుతోంది. నిరసనకారులు కేవలం ప్రదర్శనలతో ఆగకుండా ప్రభుత్వంలోని ఉన్నతాధికారుల జవాబుదారీతనాన్ని నిలదీస్తున్నారు. ఎగ్జామినేషన్ సిస్టమ్‌లో సమూల ప్రక్షాళన జరగాలని డిమాండ్ చేస్తున్నారు. అసలు ఈ విద్యాసంక్షోభానికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పదవి నుంచి తప్పుకోవాలని లేదా ఆయన్ని బర్తరఫ్ చేయాలని అందరూ గట్టిగా కోరుతున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం మంత్రిని కాపాడుతూనే దిద్దుబాటు చర్యలకు దిగింది. ఇందులో భాగంగానే ఇప్పటివరకు విద్యాశాఖ కార్యదర్శిగా కొనసాగిన వినీత్ జోషిని ఆ బాధ్యతల నుంచి తప్పించడం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

### తెరపైకి నరేష్ గంగ్వార్

వినీత్ జోషి స్థానంలో 1994 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ నరేష్ గంగ్వార్ ను కేంద్రం కొత్త విద్యాశాఖ కార్యదర్శిగా నియమించింది. రాజస్థాన్ కేడర్‌కు చెందిన గంగ్వార్ ఇప్పటివరకు కేంద్రంలోని మత్స్య, పశుసంవర్ధక, డెయిరీ మంత్రిత్వ శాఖలో పశు సంవర్ధక విభాగానికి కార్యదర్శిగా సేవలు అందించారు. ఇప్పుడు ఆయన్ను నేరుగా అత్యంత సున్నితమైన, ప్రతిష్టాత్మకమైన శాఖకు కార్యదర్శిగా బదిలీ చేశారు. దేశం మొత్తం ఇప్పుడు విద్యావ్యవస్థ వైపు చూస్తున్న సమయంలో నరేష్ గంగ్వార్ భుజాలపై భారీ బాధ్యత పడింది.

### ఇదొక తంతు మాత్రమేనా?

ప్రభుత్వం తరఫున తీసుకుంటున్న ఈ చర్యలు ఎంతవరకు ఫలితాన్ని ఇస్తాయనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. కేవలం కార్యదర్శులను మార్చడం వల్ల దశాబ్దాలుగా పాతుకుపోయిన అవినీతి వేర్లు తొలగిపోతాయా లేక ఇదొక తూతూ మంత్రమేనా అని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. నిరసనకారులు మాత్రం పేపర్ లీకేజీలకు పాల్పడిన అసలు సూత్రధారులను పట్టుకునే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు రాజకీయ పార్టీలు కూడా ఈ అంశాన్ని తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తుండటంతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి రోజురోజుకూ విపరీతంగా పెరుగుతోంది.

# బ్యాన్‌తో సినిమా బ్లాస్ట్

## సట్లూజ్ సినిమా పెను తుఫాన్!

- కంటతడి పెట్టిస్తున్న పంజాబ్ విషాదం
- నిషేధిత చిత్రానికి నీరాజనం పడుతున్న జనం
- ఆపరేషన్ బ్లూస్టార్ పాత గాయాలు
- గురుద్వారాల్లో స్క్రీనింగ్‌లు... ఇంటర్నెట్ ట్రెండ్
- కాలం చెల్లిన సెన్సార్‌షిప్ బండారం
- చరిత్ర గాయాలు మోస్తున్న వెండితెర

**పంజాబ్‌లో ఉగ్రవాదాన్ని అణచివేసిన ఆ చీకటి దశాబ్దపు గాయాలను కళ్లకు కడుతూ తెరకెక్కిన సట్లూజ్ సినిమాపై ప్రభుత్వం విధించిన ఆకస్మిక నిషేధం దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. డిజిటల్ వేదికల నుంచి ఈ చిత్రాన్ని తొలగించినప్పటికీ వివాదాల కారణంగా జనం దీనిని చూసేందుకు ఎగబడుతుండటంతో పాలకుల సెన్సార్ విధానాలపై తీవ్రమైన ప్రశ్నలు వ్యూహాత్మకంగా తలెత్తుతున్నాయి. - సహనం వందే, హైదరాబాద్**

పంజాబ్‌లో జరిగిన అన్యాయాలు ఆపరేషన్ బ్లూస్టార్ తర్వాతి పరిణామాలు ఆపై సాగిన అండర్‌గ్రౌండ్ మలిటెన్సీ వంటి సున్నితమైన అంశాలను ఆధారంగా చేసుకుని సట్లూజ్ చిత్రాన్ని తెరకెక్కించారు. ప్రముఖ నటుడు దిల్జిత్ దోసాంజ్ హనీ త్రేహాన్ కలయికలో రూపుదిద్దుకున్న ఈ సినిమా ఈ నెల 3న ప్రముఖ ఓటీటీ వేదిక జీఈఈ5లో విడుదలైంది. అయితే విడుదలైన రెండు రోజుల్లోనే కేంద్ర ప్రభుత్వం దీని ప్రసారాలపై సంచలన నిర్ణయం తీసుకుంది. పంజాబ్‌లో మళ్లీ శాంతిభద్రతల సమస్య తలెత్తవచ్చనే భయంతో ప్రభుత్వం దీన్ని పూర్తిగా నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది.

### నిషేధమే అతిపెద్ద పబ్లిసిటీ

ప్రభుత్వాలు నిషేధించడమే ఆలస్యం ప్రజల్లో దీనిపై విపరీతమైన ఉత్సుకత పెరిగిపోయింది. ఒక సినిమాను థియేటర్లలో చూడలేని పరిస్థితి కల్పించినప్పుడు డిజిటల్ ప్రపంచంలో దక్కే పబ్లిసిటీ ఊహకు కూడా అందదు. ఇప్పుడు సరిగ్గా అదే జరుగుతోంది. ఏ ఒక్క సింగిల్ స్క్రీన్‌పై కూడా ప్రదర్శనకు నోచుకోని ఈ చిత్రం కేవలం నిషేధం కారణంగానే చరిత్రలోనే అత్యధిక మంది చూసిన పంజాబీ సినిమాగా రికార్డులకెక్కుతోంది. వివాదమే దీనికి అతిపెద్ద ప్రచారకర్తగా మారిపోయింది.

### విదేశాల్లో విపరీతమైన ఆదరణ

మన దేశంలో ఈ ప్లాట్‌ఫామ్‌పై దీన్ని బ్లాక్ చేసినప్పటికీ విదేశాల్లోని సర్వర్లలో మాత్రం ఇది కొద్ది రోజుల పాటు అందుబాటులోనే ఉంది. దీంతో విదేశాల్లో ఉంటున్న ప్రవాస భారతీయులు ఈ సినిమాను ఎగబడి చూశారు. పంజాబ్‌లో నివసించే స్థానికులు సైతం దీన్ని ఎలాగైనా చూడాలనే పట్టుదలతో ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించారు. పంజాబ్‌లోని పలు ప్రాంతాల్లోని గురుద్వారాల్లో కమ్యూనిటీ స్క్రీనింగ్‌లు ఏర్పాటు చేసి మరీ దీన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రదర్శనలకు ఊహించని రీతిలో జనం పోటెత్తుతున్నారు.

### కంటతడి పెట్టిస్తున్న రెండు తరాలు

ఈ సినిమా చూస్తున్న వారిలో రెండు తరాలవారు కనిపిస్తున్నారు. ఒక వైపు ఆ చీకటి రోజులను స్వయంగా అనుభవించి సర్వస్వాన్ని కోల్పోయిన వృద్ధులు... మరోవైపు ఆ గతం గురించి కేవలం తమ ఇంట్లోని పెద్దల ద్వారా మాత్రమే విన్న నేటి యువతరం. గురుద్వారాల్లో తెరపై పడుతున్న దృశ్యాలను చూస్తూ ఈ రెండు తరాల వారు కంటతడి పెడుతున్నారు.ఆ కాలం నాటి క్షోభను భయానక వాతావరణాన్ని ఈ సినిమా అచ్చం అలాగే కళ్లకు కట్టినట్లు చూపించిందని ప్రేక్షకులు కన్నీటి పర్యంతమవుతున్నారు. జస్వంత్ సింగ్ ఖల్లా వంటి హక్కుల కార్యకర్తల పోరాటాలు... నకిలీ ఎన్‌కౌంటర్ల బారిన పడి బలైన అభాగ్యుల జ్ఞాపకాలు ఇప్పటికీ ఆ ప్రాంత ప్రజల మనసుల్లో సజీవంగానే ఉన్నాయి.

### డిజిటల్ యుగంలో సెన్సార్ భ్రమలు

ఒక కళాఖండాన్ని లేదా ఒక చారిత్రక అంశాన్ని దృశ్య రూపంలో ఆవిష్కరించినప్పుడు దానిని అణచివేయాలని చూస్తే ఫలితం వ్యతిరేకంగా వస్తుందనేందుకు ఈ ఘటనే తాజా ఉదహరణ. భావప్రకటన స్వేచ్ఛకు శాంతిభద్రతలకు మధ్య ఎక్కడో ఒకచోట సమతుల్యత ఉండాలనే డిమాండ్లు మళ్లీ తెరపైకి వస్తున్నాయి.కేవలం ఒక సినిమా భద్రతా సమస్యలను సృష్టిస్తుందని భావించడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్న మేధావుల నుంచి వినిపిస్తోంది. డిజిటల్ యుగంలో ఏ సమాచారమైనా ఏ చిత్రమైనా ఇట్టే సరిహద్దులు దాటిపోతుంది. ఒక ప్రాంతంలో బ్యాన్ చేస్తే మరో ప్రాంతం నుంచి అది మరింత వేగంగా వైరల్ అవుతుంది.